క్లుప్తంగా

ఘనంగా సంకష్టహర చతుర్థి



పూజలో పాల్గొన్న భక్తులు

యైటింక్లయిన్‌కాలనీ: సంకష్టహర చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకొని రామగుండం కార్పొరేషన్ యైటింక్లయన్‌కాలనీ శ్రీఅయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం రాత్రి గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు దేవప్రకాశ్ పాండే గణపతిస్వామి మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఆర్జీ–2 ఏరియా వర్క్‌షాప్ డీజీఎం ఎర్రన్న ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయి



మనాలీ ఠాకూర్‌ను సన్మానిస్తున్న మహిళలు

జ్యోతినగర్: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుబాటులో ఉన్నాయని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ సతీమణి మనాలీ ఠాకూర్ అన్నారు. ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలో మంగళవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీలో పలు వాడల్లో తిరుగుతూ ప్రజలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఏమేరకు అందుతున్నాయో తెలుసుకున్నారు. అర్హులైన వారికి అందేలా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి అమలయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఎన్టీపీసీ ప్రాంతంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలందరూ సహకరించాలని ఆమె కోరారు. అనంతరం మహిళలు ఆమెను సన్మానించారు. కాంగ్రెస్ ఎన్టీపీసీ మహిళా పట్టణ అధ్యక్షురాలు పద్మ పాల్గొన్నారు.

గ్రామాల్లో పర్యటన

పాలకుర్తి: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికి అందుతాయని ఎమ్మెల్యే సతీమణి, మక్కాన్‌సింగ్ సేవాసమితి అధ్యక్షురాలు మనాలీఠాకూర్ అన్నారు. పాలకుర్తి మండల పరిధిలోని పుట్నూర్, కుక్కలగూడుర్ గ్రామాల్లో మంగళవారం పర్యటించి వ్యవసాయకూలీలతో మాట్లాడారు. కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వచ్చే నాలుగేళ్లలో నియోజకవర్గంలో దాదాపు 14వేల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించేందుకు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ కృషి చేస్తున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉరు.

మల్లు స్వరాజ్యం వర్ధంతి



నివాళి అర్పిస్తున్న నాయకులు

గోదావరిఖని: సాయుధ తెలంగాణ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం వర్ధంతి మంగళవారం స్థానిక గంగానగర్‌లోని మల్లు స్వరాజ్యం కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వై.యాకయ్య, మహేశ్వరి, మేదరి సారయ్య, సృజన, అరుణజ్యోతి, భాస్కర్, రజిత, సులోచన, కృష్ణకుమారి, మణెమ్మ, సరిత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

రెండో డివిజన్ సమస్యలు పరిష్కరించాలి

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్‌లోని ప్రధాన సమస్యలు పరిష్కరించాలని సీపీఎం ఎన్టీపీసీ రామగుండం ఏరియా కమిటీ కార్యదర్శి ఎం.రామాచారి, జిల్లా కమిటీ సభ్యులు, ఎస్.బిక్షపతి, గీట్ల లక్ష్మారెడ్డి, రవీందర్, అక్కపాక శంకర్ డిమాండ్ చేశారు. డివిజన్‌లో మంగళవారం వారు పర్యటించారు. ఇందిరమ్మ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్లు నిర్మించాలని కోరారు. కాలనీ ఏర్పడి 15ఏళ్లు అవుతున్నా ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం బాధాకరమన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు డివిజన్లలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, లేనియెడల ప్రజలతో కలిసి మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తామని పేర్కొన్నారు.

ఆలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

సుల్తానాబాద్: పోచమ్మ ఆలయాల చుట్టుపక్కల ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ నియాజ్ మంగళవారం మున్సిపల్ కార్మికులతో శుభ్రం చేయించారు. ఆలయం పక్కన ఉపకాలువ ఉండడంతో భక్తులకు ఆలయానికి వెళ్లేలా రహదారి శుభ్రం చేయించారు. భక్తులకు సౌకర్యంగా ఉండేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

‘మా భూముల్లో ఇండస్ట్రియల్ పార్క్ వద్దు’

- అధికారులను అడ్డుకున్న రత్నాపూర్ గ్రామస్తులు



రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

రామగిరి: ‘జీవనాధారమైన మా భూముల్లో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయొద్దు’ అంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. రామగిరి మండలం రత్నాపూర్‌లోని మేడిపల్లి శివారులోని సుమారు 209 ఎకరాల స్థల పరిశీలనకు మంగళవారం కరీంనగర్ టీజీఐఐసీ జనరల్ మేనేజర్ మహేశ్వర్, కంపెనీ ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు రాగా గ్రామస్తులు అడ్డుకుని ఆందోళన నిర్వహించారు. రత్నాపూర్ గ్రామంలో రైతులు, మహిళలు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. సుమారు 4గంటల పాటు రోడ్డుపై ఆందోళన చేయడంతో మంథని ఆర్డీవో సురేశ్, గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్ వచ్చి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినలేదు. తమ విలువైన భూములను ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం ఇవ్వబోమని తేల్చిచెప్పారు. తమకు తెలియకుండానే ప్రభుత్వం తమ భూములను లాక్కునే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామసభ ఏర్పాటు చేయకుండా తమ భూములను తీసుకుంటే ఊరుకునే ప్రసక్తే లేదని, ప్రభుత్వం తమ నిర్ణయాన్ని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ఎంత చెప్పినా రైతులు వినకపోడవంతో అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు.

పవర్‌హౌస్‌కాలనీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



బస్తీబాటలో సీఐటీయూ నాయకులు

గోదావరిఖని: పవర్‌హౌస్‌కాలనీలోని కార్మిక కుటుంబాల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి కోరారు. సీఐటీయూ బ్రాంచి కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పవర్‌హౌస్‌కాలనీ శివాలయం ఏరియాలోని టీటూ క్వార్టర్లలో మంగళవారం బస్తీబాట నిర్వహించారు. క్వార్టర్లన్నీ అధ్వానమైన పరిస్థితుల్లో ఉన్నాయన్నారు. సరైన మంచినీరు లేక డ్రైనేజీ వ్యవస్థ సరిగాలేక, రోడ్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమస్యలు పరిష్కరించడంలో యజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం స్పందించి క్వార్టర్లను పూర్తిస్థాయిలో మరమ్మతు చేసి, డ్రైనేజీ, రోడ్ల వ్యవస్థను ఆధునీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మెండె శ్రీనివాస్, ఆసరి మహేశ్, నంది నారాయణ, శివరాంరెడ్డి, అన్నవేణి శంకర్, సమ్మయ్య, ఎ.జనార్దన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డుభద్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని కుందనపల్లి, మల్యాలపల్లి గ్రామాల శివారు పరిధిలోకి వచ్చే రాజీవ్ రహదారిపై ఇటీవల వరుస రోడ్డు ప్రమాదాల దృష్ట్యా మంగళవారం పోలీసులు రోడ్డు భద్రతా చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించింది. రోడ్డు ప్రమాదాలు జరిగే మల్యాలపల్లి సబ్‌స్టేషన్ సమీపంలోని రోడ్డును బ్లాక్‌స్పాట్‌గా గుర్తించి ప్రమాద సూచికగా రెడ్ రిబ్బన్ వేలాడదీశారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని సూచించారు. మూలమలుపుల వద్ద ముందున్న వాహనాలను ఓవర్ టేక్ చేయొద్దని, చౌరస్తాలు ఉన్న ప్రాంతాల్లో నెమ్మదిగా వెళ్లాలని హితవు పలికారు. అదేవిధంగా సైబర్ నేరాల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించారు. గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్, రామగుండం సీఐ తంగళ్లపల్లి ప్రవీణ్‌కుమార్, అంతర్గాం ఎస్సై బోయ వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

బ్యాంకుల టార్గెట్ పూర్తి చేయాలి



మాట్లాడుతున్న రీజినల్ మేనేజర్ అపర్ణరెడ్డి

జ్యోతినగర్: అర్హులైన స్వశక్తి సంఘాలకు బ్యాంకు రుణాల మంజూరుతో పాటు ఆర్థిక సంవత్సరంలో బ్యాంకుల టార్గెట్ పూర్తి చేయాలని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ అపర్ణరెడ్డి ఆదేశించారు. ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్ ఉద్యోగ వికాస కేంద్రం ఆడిటోరియంలో మంగళవారం యూనియన్ బ్యాంకు మెగా బ్యాంక్ లింకేజీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అర్హత గల స్వశక్తి సంఘాల మహిళలకు రుణాలు అందించేందుకు బ్యాంకులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రస్తుత సంవత్సరంలో లక్ష్యం ప్రకారం మరిన్ని రుణాలు పొందేందుకు అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం సీహెచ్ వెంకటేశ్, డీపీఎం సతీశ్, ఏపీఎం సంపత్, టీఎల్ఎం మౌనిక, జిల్లాలోని తొమ్మిది యూనియన్ బ్యాంకుల అధికారులు, మెప్మా, సెర్ప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వశక్తి సంఘాలకు రుణాలు మంజూరు చేయాలి

స్వశక్తి సంఘాల సభ్యులకు రుణాలను బ్యాంకర్లు సత్వరమే మంజూరు చేయాలని అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. ఎన్టీపీసీ టీటీఎస్‌లోని ఆడిటోరియంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రుణాల మంజూరులో మెప్మా సిబ్బంది అర్హత గల మహిళలను గుర్తించి వారిని పొదుపు సంఘాల్లో సభ్యులుగా చేర్పాలని సూచించారు.

స్వచ్ఛతపై కళాకారుల అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

కోల్‌సిటీ: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో స్వచ్ఛతపై కళాకారులు తమ పాటలతో అవగాహన కల్పిస్తున్నారు. స్థానిక 11వ డివిజన్‌లోని ఫైవ్ ఇంక్లైన్ చౌరస్తాలో మంగళవారం రాత్రి కమిషనర్(ఎఫ్ఏసీ) జె.అరుణశ్రీ, డిప్యూటీ కమిషనర్ ఆదేశాలతో పచ్చదనం, పరిశుభ్రత, ప్లాస్టిక్ నివారణ, తడి, పొడి చెత్తపై ఆకట్టుకునేలా కళాకారులు తమ పాటలతో అవగాహన కల్పించారు. డివిజన్ వార్డ్ ఆఫీసర్ మంగ, జోన్ సూపర్‌వైజర్ ఆడెపు శ్రీనివాస్, ఎన్విరాన్మెంట్ విభాగం సిబ్బంది శ్రీకాంత్, కళాకారులు పద్మ, దయా నర్సింగ్, జనగామ రాజనర్సు, రవీందర్ పాల్గొన్నారు.

పరిహారంపై అధికారులు ఇబ్బంది పెడుతున్నారు



మంత్రికి విన్నవిస్తున్న భూ నిర్వాసితులు

రామగిరి: ఆర్అండ్ఆర్ పరిహారంపై సింగరేణి అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని మంగళవారం రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబును లద్నాపూర్ భూనిర్వాసితులు హైదరాబాద్‌లో కలిసి విన్నవించారు. గతంలో అధికారులు కమిటీ వేసి చర్చలకు రావాలని తెలిపారని, మళ్లీ పరిహారం విషయంలో స్పందించడం లేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి పరిహారం అందించిన తర్వాతే గ్రామం వద్ద ఆర్అండ్‌బీ రోడ్డు డైవర్షన్ పనులు మొదలుపెట్టేలా చూడాలని గ్రామస్తులు విన్నవించారు. స్పందించిన మంత్రి సింగరేణి సీఅండ్ఎండీ బలరాం నాయక్‌తో మాట్లాడి త్వరతిగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతీ ఒక్కరికి న్యాయం జరిగేలా చూస్తానని మంత్రి హామీ ఇచ్చారని గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు వనం రాంచందర్‌రావు, బీ.వీ.స్వామిగౌడ్, బర్ల శ్రీనివాస్, తొగరి లింగయ్య, పొన్నం సత్యనారాయణ, మేడగాని రాంచందర్, తాళ్లపల్లి చంద్రయ్య, తాటి శ్రీనివాస్, జమీల్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

మంథని: మంథని మండలం చిల్లపల్లి గ్రామపంచాయతీలో పారిశుధ్య నిర్వహణ పనులను డీఎల్‌పీవో సతీశ్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. పంచాయతీలో అనుమతి లేకుండా నిర్మాణం చేపట్టొద్దని సూచించారు. గ్రామంలో అభివృద్ధి పనులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్ల బిల్లు ఆమోదంపై హర్షం

సుల్తానాబాద్: బీసీలకు 42శాతం రిజర్వేషన్ బిల్లును శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించినందుకు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బీసీ యువజన సంక్షేమ సంఘం తరపున సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని మంత్రి చాంబర్‌లో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. బీసీ హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న బీసీ సంఘాలకు, కుల సంఘాలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

• యూత్ కాంగ్రెస్ నాయకుల సంబరాలు

గోదావరిఖని: రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టడాన్ని హర్షిస్తూ యూత్‌కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రధాన చౌరస్తాలో సంబరాలు నిర్వహించారు. టపాకాయలు పేల్చి, స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు బొంతల రాజేశ్, తిప్పారపు శ్రీనివాస్, కొటం సతీశ్, బాలరాజు, ముస్తఫా, రాజేశ్ పాల్గొన్నారు.

• వాహనాల తనిఖీ

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుంపుల గ్రామంలో ఏఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. గుంపుల మీదుగా కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్‌కు వెళ్లే వాహనాలను తనిఖీ చేసి అనుమతి పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు.

• చివరకు నీరందేలా సహకరించాలి

మంథని: పంటలను కాపాడుకునేందుకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నీటిని విడుదల చేయించారని, తమ పంటలకు నీరు పారాక చివరి రైతులకు చేరేలా సహకరించాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముస్కుల సురేందర్‌రెడ్డి కోరారు. మంథని నియోజకవర్గంలోని మంథని, ముత్తారం, కమాన్‌పూర్, రామగిరి మండలంలోని చివరి ఆయకట్టు రైతుల పొలాలు ఎండిపోకుండా మంత్రి ప్రత్యేక చొరవ తీసుకొని అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ సాగునీరు అందేలా కృషి చేస్తున్నారన్నారు. మంత్రికి, అధికారులకు రైతుల పక్షాన ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

• ఉరివేసుకుని ఒకరు ఆత్మహత్య

పెద్దపల్లిరూరల్: పట్టణ శివారులోని రంగంపల్లికి చెందిన పూదరి శ్రీనివాస్ (45) మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ మూర్ఛతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. కుటుంబీకులు మద్యం తాగొద్దని అనడంతో మనస్తాపానికి గురై ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. మృతుడి భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలున్నారు.

• మారుతినగర్‌కు చెందిన యువకుడు..

పాలకుర్తి: మండలంలోని బసంత్‌నగర్ గ్రామపంచాయతీ పరిధి మారుతినగర్‌కు చెందిన ఆరె అజయ్(24) మంగళవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బసంత్‌నగర్ ఎస్సై స్వామి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఆరె లక్ష్మయ్య–పద్మ దంపతుల కుమారుడు అజయ్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆసుపత్రిలో చికిత్స పొందినా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన అజయ్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు ఇంటికి వచ్చేసరికి మరణించాడు. స్థానికులు సమాచారం మేరకు బసంత్‌నగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

• దొంగతుర్తిలో ఉచిత కంటి వైద్యశిబిరం

ధర్మారం: మండలంలోని దొంగతుర్తి రైతువేదికలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు దాడి సదయ్య ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆసుపత్రి సహకారంతో మంగళవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 70మందికి కంటి పరీక్షలు నిర్వహించి 21మందికి కంటి ఆపరేషన్ అవసరంగా గుర్తించారు. ఈ 21మందిని ఆసుపత్రి ప్రత్యేక బస్సులో రేకుర్తికి పంపించారు. లయన్స్‌క్లబ్ వైస్ చైర్మన్ చిదుర సురేశ్, రీజనల్ చైర్మన్ రాజేందర్, క్లబ్ కార్యదర్శి కాల్వ రమేశ్, వైస్ ప్రెసిడెంట్ ముత్యాల చంద్రశేఖర్, కోశాధికారి ఆకుల తిరుపతి, సభ్యులు కొత్త మోహన్, వేల్పుల చంద్రశేఖర్, సంకరి చిన్న ఓదెలు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

• పాఠశాలల్లో ట్విన్నింగ్ కార్యక్రమం

కాల్వశ్రీరాంపూర్: విద్యార్థుల్లో అభ్యసనా నైపుణ్యం పెంపొందించేందుకు ట్విన్నింగ్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని ఎంఈవో మహేశ్‌కుమార్ సూచించారు. మండంలోని పెగడపల్లి జెడ్పీ హైస్కూల్లో మంగళవారం అంకంపల్లి, మడిపెల్లి కాలనీ విద్యార్థులు, వెన్నంపల్లి జెడ్పీహైస్కూల్లో మంగపేట, జాఫర్‌ఖాన్‌పేట పాఠశాల విద్యార్థులకు ట్విన్నింగ్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

• జీతం వెంటనే చెల్లించాలి

జూలపల్లి: మండల కేంద్రంలోని పోస్టాఫీస్‌లో ఆరున్నర నెలలు టెంపరరీగా ఉత్తరాలు బట్వాడా చేసిన తనకు జీతం వెంటనే చెల్లించాలని అమరగాని శ్రీకాంత్ మంగళవారం పోస్టాఫీస్ వద్ద నిరసన తెలిపాడు. అనంతరం జూలపల్లి బీపీఎం భావనకు వినతిపత్రం అందజేశారు.

బ్యాంకు పథకాలను వినియోగించుకోండి



బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న చీఫ్ జనరల్ మేనేజర్, జీఎం

యైటింక్లయిన్‌కాలనీ: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందిస్తున్న పథకాలను సింగరేణి కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చీఫ్ జనరల్ మేనేజర్ హైదరాబాద్ రాజేశ్‌కుమార్, ఆర్జీ–2 జీఎం వెంకటయ్య అన్నారు. యైటింక్లయిన్‌కాలనీలోని ఎస్‌బీఐ బ్యాంక్ రెనోవేటెడ్ ప్రెమిసెస్ ఆఫ్ జల్లారం బ్రాంచ్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఆర్జీ–2 ఏరియా సింగరేణి అధికారులు ఏజీఎం ఎర్రన్న, డీజీఎం మురళీకృష్ణ, ధనుంజయ్, అనిల్‌కుమార్, షరీఫ్ మహమ్మద్, బ్యాంక్ అధికారులు బిజయ్ కుమార్ సోహూ, కుమార్‌సింగ్, బ్రాంచ్ మేనేజర్ సంజయ్ కుమార్, చందు, దినేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణి వార్తలు

యంత్రాలను ఆధునీకరించాలి



మాట్లాడుతున్న శంకర్‌నాయక్

గోదావరిఖని: ఓసీపీ–3 ప్రాజెక్టులో యంత్రాలను మరమ్మతు చేసి ఆధునీకరించకపోతే సమ్మె చేస్తామని ఆర్జీ–2 ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు బదావత్ శంకర్‌నాయక్ అన్నారు. ఓసీపీ–3 ప్రాజెక్టును మంగళవారం సందర్శించి యంత్రాల వైఫల్యాలను పరిశీలించారు. ఓసీపీల ద్వారా అత్యధిక బొగ్గు ఉత్పత్తి చేస్తున్నాయన్నారు. ఓసీపీల్లో నడిచే యంత్రాలకు మరమ్మతు చేయించకుండా కార్మికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. యంత్రాలను మరమ్మతు చేయించని పక్షంలో ఓసీపీలో పనులు నిలిపివేస్తామని పేర్కొన్నారు. వేసవిలో కార్మికులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. నాయకులు ఎండీ అక్రం, సత్యనారాయణరెడ్డి, సంపత్‌రెడ్డి, సాలిగామ మల్లేశ్, కొంగర రవీందర్, ఆకుల రాజయ్య, చల్ల శ్రీనివాస్, మల్లికార్జున్, గజ్జి ఓదెలు, శేషకుమార్, రమేశ్‌రెడ్డి, లక్ష్మణ్‌రావు, కార్మికులు పాల్గొన్నారు.

వృత్తివిద్యా కోర్సులు సద్వినియోగం చేసుకోండి

గోదావరిఖని: ఆర్జీ–2 ఏరియాలో వృత్తి విద్యా కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీ–2 జీఎం బి.వెంకటయ్య మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. జీడీకే–7 ఎల్ఈపీ గని ప్రజాభిప్రాయ సేకరణలో వచ్చిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని ఈవృత్తి విద్యాకోర్సులు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రాజెక్ట్ ప్రభావిత గ్రామాలైన వీర్లపల్లి, న్యూమారేడుపాక, అల్లూరు, పోతనకాలనీ, గోదావరిఖనిలోని విఠల్‌నగర్, రమేశ్‌నగర్ గ్రామాల మహిళలకు టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్క్, యువకులకు లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణ ఇప్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈనెల 24లోగా ఆర్జీ–2 ఏరియాలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

కార్మికుల శ్రేయస్సు కోసం బీఎంఎస్ కృషి



మాట్లాడుతున్న బీఎంఎస్ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి కార్మికుల శ్రేయస్సు కోసం బీఎంఎస్ సంఘం కృషి చేస్తుందని సింగరేణి బీఎంఎస్ సంఘం అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి సారంగపాణి అన్నారు. ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ బీఎంఎస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అప్పులతో, ఆర్థికంగా నష్టపోయిందని ఆరోపించారు. ఒక్కటి కూడా కొత్త బొగ్గు గని తేలేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీఆర్ఎస్ బాటలోనే నడుస్తోందని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలం అవుతోందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నుంచి సింగరేణికి చెల్లించాల్సిన బకాయిలు రూ.35కోట్లు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించి కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు నష్టం జరిగితే బీఎంఎస్ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి ఆందోళనలు చేస్తామని పేర్కొన్నారు. నాయకులు రవీందర్, రౌతు రమేశ్, ప్రమోద్ కాశాల్, ప్రసాద్, రమేశ్, సతీశ్, కృష్ణ, శ్రీనివాస్, సురేశ్ పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు



ఎలిగేడు: ధూళికట్టలో విద్యార్థుల నృత్యం



జూలపల్లి: నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఎలిగేడు: మండలంలోని ధూళికట్ట జెడ్పీ హైస్కూల్లో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు తొమ్మిదో తరగతి విద్యార్థులు వీడ్కోలు పలికారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో ఎలాంటి ఒత్తిడికి లోనుకావొద్దని హెచ్ఎం సదయ్య సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేసి నృత్యాలు ఆహుతులను అలరించాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదర్శలో వీడ్కోలు వేడుక



రామగుండం: విద్యార్థులు బహూకరించిన సరస్వతీదేవి విగ్రహం

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని లింగాపూర్ ఆదర్శ విద్యాలయంలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులు తమ బ్యాచ్ గుర్తింపుగా పాఠశాలకు సరస్వతి దేవి విగ్రహాన్ని బహూకరించారు. వేడుకల్లో ప్రిన్సిపాల్ అంబాల సదానందం యాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జూలపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు లచ్చయ్య మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో పాటు, ఉన్నత లక్ష్యం సాధించాలనే తపనతో పరీక్షలు రాయాలని సూచించారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తు చేసుకోండి



మంథని: మాట్లాడుతున్న నాయకులు

మంథని: యాదవ చారిటబుల్ ట్రస్ట్, అఖిల భారత యాదవ మహాసభ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా ఉగాది పురస్కారాలు అందజేయనున్నట్లు ఉగాది పరస్కారాల జిల్లా కన్వీనర్ మంద భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిని లక్ష్మణ్, మంథని డివిజన్ యూత్ అధ్యక్షుడు కనవేన శ్రీనివాస్, మంథని మండల అధ్యక్షుడు పర్ష మోహన్ తెలిపారు. మంథనిలో మంగళవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విభాగం, సాహితి, సాంస్కృతిక ,రాజకీయ, మహిళా సాధికారత, స్వచ్ఛంద సేవ, విద్యారంగ ప్రతిభా పురస్కార్ అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 23న దరఖాస్తుల స్వీకరణ, 25న స్క్రీనింగ్, 30న పెద్దపల్లిలోని రాధాకృష్ణ గార్డెన్‌లో అవార్డులు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. యాదవులు గ్రహించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లా ఉపాధ్యక్షుడు వేముల లక్ష్మణ్, నాయకులు, ముత్తారం మండల అధ్యక్షుడు కాసు తిరుపతి, యూత్ అధ్యక్షుడు చెలికల యుగేందర్, నాయకులు కానుగంటి ఓదెలు, పెరవేన లింగయ్య, మద్రి సతీశ్, కావటి సతీశ్, మాదరవేన కిషన్, కొడారి మల్లేశ్ ఉన్నారు.

యాదవ సంఘం ఆధ్వర్యంలో పురస్కారాలు

గోదావరిఖనిటౌన్: పలు రంగాల్లో నిష్ణాతులైన యాదవులను ఎంపిక చేసి ఉగాది పురస్కారాలు అందించనున్నట్లు యాదవ సంఘం సెలక్షన్ కమిటీ జిల్లా కోకన్వీనర్ ఆవుల రాజేశ్‌యాదవ్ తెలిపారు. స్థానిక రామగుండం నగర యాదవ సంఘం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదవ చారిటబుల్ ట్రస్ట్, అఖిల భారత యాదవ మహాసభ పెద్దపల్లి జిల్లా ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాలను మార్చి 30న ఆర్‌కే గార్డెన్, రాఘవాపూర్‌లో నిర్వహిస్తామని తెలిపారు. మార్చి 23 వరకు దరఖాస్తుల స్వీకరణ, 25న స్క్రీనింగ్ నిర్వహించి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 91331 19919, 90106 61282 నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గుంపుల తిరుపతియాదవ్, నాయకులు ఆర్కే యాదవ్, ముస్కె శంకర్, గుండబోయిన ఓదెలు, మారం శ్రీనివాస్, మంద భాస్కర్ పాల్గొన్నారు.